
ప్రజాశక్తి
శుక్రవారం 13 సెప్టెంబర్ 2024
5
పార్వతీపురం మన్యం



ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫీజు గడువు పెంపు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్‌లో చేరేందుకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 15లోగా చేరవచ్చని మండల సార్వత్రిక విద్యాపీఠం సమన్వయకర్త పెదిరెడ్డి శ్రీనివాసరావునాయుడు, పక్కి సదాశివరావు తెలిపారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు ఈనెల 25లోగా అపరాధ రుసుం రూ.200 ఫీజు చెల్లించే దుకు ప్రభుత్వం గడువు పెంచిందన్నారు. ఈనెల 25లోగా ఈ అపరాధ రుసుంతో చేరేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. వ్యాపార రంగాల్లో ఉన్నవారికి ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు, వివిధ సంఘాల సభ్యులకు అర్హతగా వెనుకబడిన వర్గాల వారికి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్త్, ఇంటర్ కోర్సుల్లో చేరేందుకు సువర్ణ అవకాశమని శ్రీనివాసరావు నాయుడు సదాశివరావులో పేర్కొన్నారు.

పోరాట యోధుడు ఏచూరి



ప్రజాశక్తి-విజయనగరం

కమ్యూనిస్టు ఉద్యమనేత, సిపిఎం అగ్రనాయకుడు, ప్రజా పోరాట యోధుడు సీతారాం ఏచూరి మరణంతో సిపిఎం శ్రేణులు శోకసంద్రంలో మునిగిపోయాయి. గతనెల 19 నుంచి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో అనారోగ్యంతో చికిత్సపొందుతున్న సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గురువారం మధ్యాహ్నం మృతి చెందిన విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు, వామపక్ష నాయకులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని, పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకొని ఆయన సిద్ధాంత స్ఫూర్తితో, ఆయన చూపిన ఉద్యమ బాటలో నడుస్తామని ప్రతిన బూనారు. ఆయన జిల్లాకు వచ్చిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి ముఖ్యంగా సిపిఎంకు, వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు.

ఏచూరి తో అనుబంధం మరువలేనిది : రెడ్డి వేణు

సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరితో అనుబంధం మరువలేనిదని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. 1988లో ఆయన ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పటి నుంచి అనుబంధం ఏర్పడిందని చెప్పారు. పార్టీ నిర్వహించిన అనేక శిక్షణ తరగతుల్లో ప్రత్యక్షంగా ఆయన్ను కలిసి మాట్లాడినట్టు చెప్పారు. పార్టీలో చేరడానికి పుచ్చలపల్లి సుందరయ్య మరణం ప్రేరణ కల్పిస్తే ఎదుగుదలకు ఆయన మార్గదర్శకత్వం ఉపయోగపడిందన్నారు. ఇటీవల జరిగిన విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ బహిరంగసభలో సీతారాం ఏచూరితో పాటు తానూ పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు.



స్టీల్ ప్లాంట్ పరిరక్షణ సభలో ఏచూరితో పాటు వేదికపై మాట్లాడుతున్న రెడ్డి వేణు (ఫైల్)

సీతారాం ఏచూరి లేని లోటు తీవ్రమైనది

మతోన్మాద శక్తులతో తీవ్రమైన సైద్ధాంతిక సంఘర్షణ పడుతున్న నేపథ్యంలో సీతారాం ఏచూరి మరణించడం దేశంలో మతోన్మాద వ్యతిరేక శక్తులకు తీవ్రమైన లోటు. ఏచూరితో పార్టీ సెక్రటేరియట్‌లో కలిసి మాట్లాడడం జరిగేది. ఆయన ఎదుటి వారు చెప్పిన మాటలో శ్రద్ధగా విని లోతుగా అవగాహన చేసుకొని సూటిగా స్పష్టంగా సమాధానం చెప్పగలిగే సమర్థులు. ఏవిషయం చెప్పినా మృదువుగా ఇతరులను బాధపెట్టకుండా ఒప్పించే విధంగా మాట్లాడే స్వభావం పార్టీలో వివాదాలను పరిష్కరించే దిశగా ఉండేది తప్ప పెంచే విధంగా ఉండేది కాదు. భావోద్వేగాలకు గురికాకుండా సంక్లిష్ట పరిస్థితుల్లో కూడా ఐక్యతను కాపాడే ధోరణి సీతారాం ఏచూరిది. నిత్యం నవ్వుతూ ఇతరులను ఆకర్షించే విధంగా ఉంటుంది. ఆయన ధోరణి. నేటి జాతీయ, అంతర్జాతీయ సంక్లిష్ట పరిస్థితుల్లో సీతారాం ఏచూరి లేని లోటు తీవ్రమైనది. వారి కుటుంబానికి మరింతం కష్టమైనది. ఆయన మృతికి నివాళులర్పిస్తున్నాం.

ఎం.కృష్ణమూర్తి,
సిపిఎం సీనియర్ నాయకులు



2009లో నాగూరులో జరిగిన ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబుతో చర్చిస్తున్న ఏచూరి

2009 ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొనేందుకు జిల్లాకు రాక

సీతారాం ఏచూరి 2009 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 13న నాగూరులో నిర్వహించిన బహిరంగ సభకు విచ్చేశారు. మహాకూటమి తరపున చేపట్టిన ఈ ప్రచార సభలకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కూడా విచ్చేశారు. నాగూరు నియోజకవర్గంలో సిపిఎం తరపు పోటీ చేసిన అభ్యర్థిని గెలిపించేందుకు అక్కడ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఏచూరి ప్రసంగించారు. అదే రోజు సాలూరు, వియనగరంలో జరిగిన బహిరంగ సభల్లోనూ సీతారాం ఏచూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అంతేకాకుండా జిల్లాలో విద్యార్థి ఉద్యమాల్లోనూ, సిపిఎం, పలు ప్రజాసంఘాల్లో నాయకులుగా ఉన్న చాలా మంది సీతారాం ఏచూరిని రాజకీయ శిక్షణ తరగతులు, పార్టీ మహాసభలు తదితర సందర్భాల్లో కలుసుకున్నారు. ఆయన నుంచి ఎంతో స్ఫూర్తిని పొందారు.

ఏచూరి మృతికి పలువురు సంతాపం

పార్వతీపురంరూరల్ : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి భారత సమాజంలో తీరని లోటని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అన్నారు. బడుగు, బలహీన, కార్మిక, కర్షక, పీడిత వర్గాల కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహెూన్నత వ్యక్తిని, అలాంటి వ్యక్తి భాతర సమాజం కోల్పోయిందని సంతాపం తెలిపారు.

కొమరాడ : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మరణం దేశానికి, కమ్యూనిస్టులకు తీరని లోటని టిడిపి అరకు పార్లమెంటరీ తెలుగు రైతు అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు అన్నారు. సీతారాం ఏచూరి మృతిపై ఆయన శ్రద్ధాంజలి ఘటిస్తూ గురువారం నివాళులర్పించారు. పేదలకు ఉపాధి అవకాశాలు ఉండాలనే ఉద్దేశంతో ఉపాధి హామీ చట్టం కోసం ఆనాడు మన్మోహన్ సింగ్ ప్రభుత్వానికి సిఫార్సులు చేసిన మహా మేధావి అనీ కొనియాడారు

ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

ప్రజాశక్తి - పార్వతీపురం

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీవ్ర లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. గురువారం సీతారామ ఏచూరి మరణంతో పార్వతీపురం సుందరయ్య భవనంలో ఏచూరి చిత్రపటానికి సిపిఎం నాయకులు, కార్యకర్తలు నివాళు లర్పించారు. అనంతరం వేణు మాట్లాడుతూ ఏచూరి మృతికి సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం ప్రకటిస్తుందని, కమ్యూనిస్టు పార్టీలో గొప్ప మానవతావాది, మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త, ఆర్థికవేత్త సీతారాం ఏచూరి అని అన్నారు. ఏచూరి అనారోగ్యంతో నెల 19 నుంచి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నారని, ఆయన కొద్దిసేపటి క్రితం తుది శ్వాస విడిచారని, దీంతో కమ్యూనిస్ట్ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొందని అన్నారు. 1992 నుంచి ఆయన పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఉన్నారని, 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ ఎంపీగా పనిచేశారని తెలిపారు. దేశంలో రైతు, పేద ప్రజల, కార్మికుల విముక్తి కోసం తన రాజకీయ జీవితాన్ని త్యాగం చేసిన ఆయన సంఘ్ పరివార్, మతతత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరులో సవాళ్లను ధీటుగా ఎదుర్కొన్నారన్నారు. అనేక దశల్లో, అతను జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే రాజకీయ ఎత్తుగడలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించాడని అన్నారు. ఏచూరి జీవితం కమ్యూనిస్టు ఉద్యమానికి ఆదర్శ నిలయమని, ఆయన ఆశయ సాధనకు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, రెడ్డి శ్రీదేవి, బి. సూరిబాబు, ఎస్. ఉమామహేశ్వరరావు, పి. రాజశేఖర్, సిహెచ్ సింహాచలం, పోలినాయుడు, రాము, సురేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్ అన్నారు. ఆయన ఆశయాలు, ఉద్యమాలు బడుగు బలహీన శ్రామిక వర్గాల ప్రజల్లో చిరస్థాయిగా మిగిలిపోతాయని పేర్కొన్నారు. ఒక ఉద్యమ ధ్రువతారను సిపిఎం కోల్పోయిందని జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ అన్నారు. ఆయన మరణం పార్టీకి పెద్దలోటని పేర్కొన్నారు.

సాలూరు : పేదల, బడుగుల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వైనాయుడు అన్నారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సిపిఎం జాతీయ కార్యదర్శి వరకు అంచెలంచెలుగా ఎదిగిన గొప్ప నాయకుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. రాజ్యసభ సభ్యుడిగా ఆయన పేదల పక్షాన తన వాణి వినిపించారని చెప్పారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు శంకరరావు, రాముడు,రవి పాల్గొన్నారు.

పలుచోట్ల ఘన నివాళ్ళు



ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

మక్కువ : సీతారాం ఏచూరికి మండలంలోని దుగ్గేరులో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగు నాయుడు, మండల కన్వీనర్ తాదంగి ప్రభాకర్, కె.ఆనంద,గౌరమ్మ, శ్రీను నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా గంగు నాయుడు మాట్లాడుతూ తన జీవితాంతం పేదల అభ్యున్నతికి పాటు పడ్డారన్నారు. ఏచూరి ఆశయాలను వామపక్ష వాదులంతా ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.

వీరఘట్టం : సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటుని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి ఇందిరా అన్నారు. వీరఘట్టంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎన్.సింహాచలం, సిఐటియు నాయకులు ఎన్.ప్రసాదరావు, మహిళలు పాల్గొన్నారు.

బలిజిపేట : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీవ్ర లోటని సిపిఎం నాయకులు యమ్మల మన్మధరావు, గేదెల సత్యనారాయణ అన్నారు. ఏచూరి మృతికి సంతాపంగా స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఏచూరి జీవితం కమ్యూనిస్టు ఉద్యమానికి ఆదర్శ నిలియమని, ఆయన ఆశ సాధనకు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ కమిటీ సభ్యులు బద్దాన భానుమూర్తి, అల్లాడ కృష్ణ, అప్పలస్వామి, దాలమ్మ, ప్రమీల, లక్ష్మి, నులక మజ్జి తదితరులు పాల్గొన్నారు.





బలిజిపేట, సాలూరులో సీతారాం ఏచూరికి నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి -పార్వతీపురం

పాఠశాల ప్రత్యేక అధికారులు పాఠశాలను విధిగా సందర్శించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి "మై స్కూల్ మై ప్రైడ్" కార్యక్రమంపై పాఠశాల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒ, ఎంఇఒ, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రత్యేక అధికారులు వారంలో కనీసం రెండు రోజులు పాఠశాలలను సందర్శించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి సక్రమంగా హాజరు, చక్కని నాణ్యమైన విద్యాబోధన, మంచి మార్కులు సాధన లక్ష్యాలుగా పనిచేయాలన్నారు. ఇటీవల జరిగిన సమ్మేటివ్ పరీక్షలను ఆధారంగా చేసుకొని విద్యార్థులు ఏఏ అంశంలో వెనుకబడి ఉన్నారో పరిశీలించాలని, అందులో వారు మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవసరమగు అన్ని సూచనలు, సలహాలు ఇవ్వాలని పేర్కొన్నారు. పాఠశాల సందర్శనలో విద్యాబోధన, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయులు పుస్తకాల తనిఖీ, పాఠశాల పరిసరాలు, మా బడి మా తోట వంటి కార్యక్రమాలను తనిఖీ చేయాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా తొమ్మిది, పదో తరగతి విద్యార్థుల్లో వివిధ సబ్జెక్టుల్లో వారి అవగాహన స్థాయిని పరిశీలించాలని కలెక్టర్ అన్నారు. ఒక విద్యార్థి ఎందుకు వెనుకబడి ఉన్నాడో కారణాలు స్పష్టంగా గుర్తించాలని తద్వారా ఆ విద్యార్థి సామర్థ్యాన్ని మెరుగుపరిచి ఆ అంశంలో నిపుణుడయ్యేలా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రతి సబ్జెక్టుకు ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని, షెడ్యూలు ప్రకారం సిలబస్ పూర్తిచేయాలని తెలిపారు. ప్రతి విద్యార్థి మంచి విద్యా ప్రమాణాలు కలిగిఉండేలా విద్యనందించాలని తెలిపారు. విద్యార్థి పాఠశాలకు గైర్హాజరైతే వారి తల్లిదండ్రులతో మాట్లాడాలని, బడిమానివేసిన విద్యార్థులను బడికి తీసుకురావాలని తెలిపారు. సెల్ ఫోన్లు, బయటి ఆహారం(జంక్ ఫుడ్) పాఠశాలలకు తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా గత రెండేళ్లుగా రాష్ట్రంలోనే పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిందని, అదే స్థానాన్ని నిలుపుటకు ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని ఆయన అన్నారు. ఇంగ్లీషు మీడియం విద్యార్థులు ఇంగ్లీషు భాష పరీక్షలు రాయలేకపోతున్నందున వారు తెలుగులో పరీక్షలు రాయొచ్చని, ఇంగ్లీషు మీడియం విద్యార్థులకు భాషలో ప్రావీణ్యత పెంపొందించాలని తెలిపారు. సమావేశంలో డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు కె.రామచంద్రరావు, వై.సత్యంనాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, ఇతర శాఖల అధికారులుపాల్గొన్నారు.

సీలింగ్ ఫ్యాన్లు వితరణగా ఇచ్చిన కలెక్టరు

జిల్లాలో పలు వసతి గృహాలకు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సీలింగ్ ఫ్యాన్ లను వితరణగా అందించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు పలు వసతి సౌకర్యాలు కల్పించుటకు సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని పలు సంస్థలను విజ్ఞప్తి చేసిన జిల్లా కలెక్టర్, "నేను 20 సీలింగ్ ఫ్యాన్ లను సొంతంగా వితరణ ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గురువారం తన చేతుల మీదుగా సీలింగ్ ఫ్యాన్ లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాంఘిక, వెనుకబడిన సంక్షేమ సాధికారిత అధికారులు ఎం.డి. గయాజుద్దీన్ , ఎస్.కృష్ణ, వసతిగృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



సంక్షేమ వసతి గృహాలకు ఫ్యానును అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

వరద బాధితులకు రూ.5లక్షల విరాళం

ప్రజాశక్తి - కురుపాం

విజయవాడ వరద బాధితులకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేశ్ చంద్ర దేవ్ రూ.5లక్షల చెక్కును రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు విజయవాడలో తన క్యాంపు కార్యాలయం వద్ద గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల్లో సర్వం కోల్పోయి అనేక ఇబ్బందులు పడిన ప్రజలకు తన వంతు సహాయంగా ఈ చెక్కును అందజేశానని అన్నారు.



విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కు చెక్కును అందజేస్తున్న వీరేష్‌చంద్రదేవ్

17నుంచి స్వచ్ఛత సేవా : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

అక్టోబర్ 2న నిర్వహంచే స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈనెల 14నుంచి అక్టోబర్ 1 వరకు 'స్వభావ స్వచ్ఛత- సంస్కార్ స్వచ్ఛత' కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టరు ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో ఈనెల 17నుంచి 1వ తేది వరకు 'స్వభావ స్వచ్ఛత- సంస్కార్ స్వచ్ఛత' కార్యక్రమం జరుగుతుందని, అక్టోబరు 2వ తేదీన గాంధీ జయంతి సంధర్భంగా స్వచ్ఛ భారత్ దివస్ ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలను భాగస్వామ్యులను చేయాలని, స్వచ్ఛ భారత్ సాంస్కృతిక ఉత్సవాలు, వ్యర్థాలతో కళారూపాలు రూపకల్పలన, సామూహిక శుభ్రత డ్రైవ్‌లు నిర్వహణ, చెత్తఉండే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి శుభ్రం చేయడం, పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం కోసం సింగిల్ విండో క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు, సమీక్షించేందుకు జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టర్ అధ్యక్షతన ఎస్‌పి, డిఆర్‌ఒ, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్, డిఇఒ, జిల్లా కలెక్టర్ నిర్ణయించిన ఇతర జిల్లా అధికారులు, ఏదైనా స్వచ్ఛంద సంస్థప్రతినిధులు సభ్యులుగా ఉంటారని జిల్లా కలెక్టరు తెలిపారు. సమావేశంలో కార్యక్రమంలో డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు కె. రామచంద్ర రావు, వై. సత్యంనాయుడు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, మునిసిపల్ కమిషనర్లు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

ప్రభుత్వం పెట్టుబడి సహాయం రూ.20వేలు ఇవ్వాలని, రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో బలిజిపేట మండలంలోని వివిధ సచివాలయాల్లో వినతి పత్రాలు గురువారం అందజేశారు. మండలంలోని నారాయణపురం, పెద్దింపేట, పలగర, బలిజిపేట, చెల్లింపేట, వంతరాం, మిర్తివలస, పెదపెంకి, సచివాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ రైతు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 25,26 తేదీల్లో మండల ఆఫీసు దగ్గర జరుగు ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇది రైతులకు, వ్యవసాయానికి ఎంత ఉపయోగపడుతుందని, కౌలు రైతులు వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని చెప్పారు. మూడు నెలలవుతున్నా ఇప్పటికీ పెట్టుబడి సహాయం లేదన్నారు. రైతులు మదుపులు పెట్టి ప్రైవేటు వ్యక్తి దగ్గర అప్పులు తెచ్చి, వాటిని తీర్చడానికి బ్యాంకుల చుట్టూ రుణాల కోసం తిరుగుతున్నా లాభం లేదన్నారు. కావున ఇప్పటికే రైతులు మద్దతు ధర చాలక వ్యవసాయం లాభసాటి కాక చాలా మంది వ్యవసాయానికి దూరం అవుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఒక్కొక్క రైతుకు రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని, కౌలు రైతులకు 2011 కౌలుదారీ చట్ట ప్రకారం కార్డు ఇచ్చి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకు రుణాలు ఇవ్వాలని, కౌలు రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని, రైతులకు నష్టం చేసే వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టే జీవో 22 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొద్దాన భానుమూర్తి, పీశ వెంకటస్వామి, వెన్నెల వేణు, బలరాంనాయుడు, నల్ల ఈశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి బలగ సత్యం నారాయణ, రైతులు పాల్గొన్నారు.


మక్కువ : రైతాంగ సమస్యల పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎస్.పెద్దవలస సచివాలయం వద్ద గిరిజన సంఘం నాయకులు టి.ప్రభాకర్ మాట్లాడుతూ పెట్టుబడి సాయం రూ.20వేలు రైతుల అకౌంట్లో వెయ్యాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సమస్యలపై వినతి పత్రాన్ని స్థానిక కార్యదర్శి అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చిన్నయ్య, గిరిజన సంఘం నాయకులు బిరుసు, అనిల్ పాల్గొన్నారు.

సాలూరురూరల్ : కష్టాలతో సాగు చేస్తున్న రైతుల పాలిట యమపాసంగా తయారయ్యే జిఒ 22ను కూటమి ప్రభుత్వం వెంటనే ఉపహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం సహా కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మండలంలోని పెదపదం సచివాలయం కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన వెంగళరాయసాగర్ ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా నార్లవలస, పెదపదం, పురోహితునివలస, బోరబంద పంచాయతీల పరిధిలో రైతులకు సాగునీరందించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీతానగరం : రైతులు, కౌలు రైతులు సమస్యలు పరిష్కరించాలని కౌలు రైతు సంఘం నాయకులు రమణమూర్తి, రైతు సంఘం నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. మండలంలోని ఆర్.వెంకన్నపేట, నిడగల్లు వలస గ్రామ సచివాలయాల వద్ద రైతులతో కలిసి ఆయా కార్యదర్శులకు మెమోరాండం ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బి అప్పారావు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు ఆయా గ్రామ రైతులు రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

భామిని : రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం నాయకులు బాలేరు విఎఎ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ రైతుసంఘం నాయకులు తిరుపతి రావు, జగన్నాయకులు, కోప్పరా మిన్నరావు, రైతులు పాల్గొన్నారు.

పాలకొండ : రైతులు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వెలగవాడ, సింగన్నవలస సచివాలయాల్లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బంటు మాట్లాడుతూ తోటపల్లి కాలువ చివర గ్రామాలైన పాలకొండ మండలం, వెలగవాడ, ఓని రుద్రపేట, లుంబూరు, గరుగుబిల్లి, లక్ష్మీపురం అర్లి,తుమరాడా,కోటిపల్లి, సింగన వలస, పరుశురాంపురం ఎన్నారాపురం, గుడివాడ, తంపటపల్లి,తదితర గ్రామాలకు ఎన్నో ఏళ్ళ గా నీరు రావడంలేదని, కాలువ మరమ్మతులు చేసి వెంటనే సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కాయల జయరాం, స్థానిక రైతు సంఘం ప్రతినిధులు మునుకోటి రవికుమార్, మునుకోటి అప్పన్న, బలిజి దిలీప్‌కుమార్, పులప నర్సింగరావు, వి.రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు, సిఐటియు మండల కార్యదర్శి కాదా రాము, కౌలురైతులు తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం ఎంఎకు వినతిని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

కొమరాడ : రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25, 26 తేదీల్లో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తలపెట్టిన దర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎ.ఉపేంద్ర రైతు, కౌలు రైతులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు చిన ఖేర్జిల సచివాలయంలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు రెడ్డి శివుని నాయుడు పాల్గొన్నారు.


ఆసుపత్రి వరండాలో చికిత్స పొందుతున్న రోగులు

ఏరియా ఆసుపత్రిలో రోగుల తాకిడి

ప్రజాశక్తి - సీతంపేట

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగుల తాకిడి పెరిగింది ఏజెన్సీలో అకాల వర్షాలకు కొత్తనీరు రావడంతో వైరల్, జ్వరాలు చాపకింద నీరులా వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో స్థానిక ఏరియా ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతుంది. ఇప్పటికే ఆసుపత్రిలో 100 పడకలకు 65 మాత్రమే ఉన్నాయి. అదనపు భవన నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో రోగులకు వరండాలోనే వైద్యం అందిస్తున్నారు. అంతేకాక అత్యవసర సమయంలో ఒకే మంచంపైన ఇద్దరికి వైద్యం అందించాల్సిన అవసరం వస్తుంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి గ్రామస్థాయిలో జ్వరాల ఉధృతి తగ్గించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల సర్వసభ్య సమావేశం ఈనెల 13న జరుగుతుందని ఎంపిడిఒ జి.పైడితల్లి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి ఉరిటి రామారావు అధ్యక్షతన జరుగు ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు విధిగా హాజరు కావాలని కోరారు.

వరద బాధితులకు పలువురి విరాళం

ప్రజాశక్తి కొమరాడ

విజయవాడలో జరిగిన వరదల బీభత్సంలో నష్టపోయిన వరద బాధితుల కోసం భారీగా విరాళాలు సేకరణ చేస్తున్నట్లు మండల టిడిపి అధ్యక్షులు ఎస్ శేఖర్ పాత్రుడు తెలిపారు. గురువారం మాదలింగిలో విజయవాడ వరద బాధితులకు తన వంతు సహాయంగా మండల టీడీపీ మాజీ అధ్యక్షులు శనపతి రామచంద్ర పాత్రుడు (బాబు నాయుడు) రూ.25వేలు చెక్కును మండల పార్టీ కన్వీనర్ ఉదయ శేఖర్‌పాత్రుడుకు గురువారం అందజేశారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల నుంచి టిడిపి నాయకులతో పాటు పలువురు స్వచ్ఛందంగా వరద బాధితుల కోసం విరాళాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సేకరించిన విరాళాలను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి అందజేసి ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్‌కు అందించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

124 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక సత్యసాయి మందిరంలో గురువారం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి నేత్ర వైద్యాధికారి ఆర్.సురేష్ 124 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా 74 మందిని శస్త్ర చికిత్స కోసం ఎంపిక చేసి విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. పాలకొండ మండలం బడ్డుమాసింగికి నవజీవన్ తిరుపతి, ప్రగతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్యాంపు జూనియర్ మేనేజర్ సిహెచ్ వెంకటరమణ, ఆలయ కమిటీ సభ్యులు జి.మురళీకృష్ణ, పి.హరిబాబు, కె.సన్యాసినాయుడు, వరహానరసింహులు, శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి సిబ్బంది, నేత్ర రోగులు పాల్గొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఆలయ నిర్వహకులు భోజన సదుపాయం కల్పించారు.

విద్యాశాఖ మంత్రి దృష్టికి పాఠశాలల సమస్యలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి విద్యారంగ సమస్యలను ఎమ్మెల్యే విజయ్ చంద్ర తీసుకెళ్లారు. పాఠశాలల పరిస్థితి, వాటి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్యే గురువారం తెలిపారు. సవర భాష ప్రాంతాల్లో తెలుగు కూడా బోధించేందుకు ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. పురపాలక పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుల సమస్యలను మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లారు. అలాగే గెస్ట్ లెక్చరర్‌గా వచ్చి బోధించినప్పుడు టెట్ మినహాయింపు ఇవ్వాలని మంత్రిని కోరారు. సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. వరద ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు అండగా నిలిచిన ఎమ్మెల్యేను మంత్రి అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి బాధితులకు ధైర్యం చెప్పి ప్రభుత్వం అండగా ఉందన్న నమ్మకాన్ని కలిగించినందుకు మంత్రి నారా లోకేష్ ఎమ్మెల్యేని అభినందించారు.

నేత్రదానానికి 185 మంది అంగీకారం

ప్రజాశక్తి - కురుపాం

నేత్రదానానికి 185 మంది అంగీకరించినట్లు నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన నేత్రదాన పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ 286 మందిని చైతన్యపరచగా 185 మంది ముందుకొచ్చి తమ నేత్రాలను దానం చేసేందుకు అంగీకార పత్రాలను అందజేశారన్నారు. వారందరికీ అభినందన సర్టిఫికెట్లు అందజేశామని అన్నారు. ప్రజల్లో చైతన్యం వచ్చి ఇంకా ఎవరైనా తమ నేత్రాలను మరణానంతరం దానం చేయాలనుకుంటే ప్రభుత్వ ఆసుపత్రిలో గానీ, జిల్లా అంధత్వ నివారణ సంస్థను గానీ సంప్రదిస్తే వారు తగు సూచనలు, సలహాలు ఇచ్చి అంగీకార పత్రాలను స్వీకరిస్తారని అన్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయకులు మాలిక, సిబ్బంది పాల్గొన్నారు.

సుఖ వ్యాధులపై సందేహాలుంటే 1097కి కాల్ చేయండి

ప్రజాశక్తి - కురుపాం

సుఖ వ్యాధులపై సందేహాలుంటే 1097 నెంబర్ కు కాల్ చేయాలని వైడిఒ నెట్వర్క్ ఔట్‌రీచ్ వర్కర్ ఎ.గీతారాణి అన్నారు. గురువారం కురుపాం వారపు సంతలో మీకు తెలుసా అనే కార్యక్రమం లో భాగంగా ఆశా వర్కర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంతకు వచ్చిన గిరిజనులకు 1097 టోల్ ఫ్రీ నెంబర్ ప్రాముఖ్యత గూర్చి వివరించి హెచ్ఐవి ఎయిడ్స్, సుఖ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు, గిరిజన మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

తాగు నీటికి అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఆరు నెలలుగా తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నామని మండల కేంద్రంలోని కస్పా వీధికి చెందిన పలువురు దళిత మహిళలు గురువారం మేజర్ పంచాయతీ ఇఒ ఎం.రవి వద్ద తమ గోడు వెల్లబుచ్చుకున్నారు. తమ వీధులకు రక్షిత మంచినీటి పథకం, కుళాయి పాయింట్లు ద్వారా తాగునీరు సక్రమంగా రాకపోవడంతో ఎగువ ప్రాంతానికి వచ్చి తాగునీరు తీసుకెళ్లి దాహార్తిని తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ వీధి వద్దకు వచ్చేసరికి కుళాయిల ద్వారా కొద్దిపాటి నీరు రావడం వల్ల గుక్కెడు నీటి కోసం ఆరాటం తప్పడం లేదన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేటకు చెందిన బిడ్డిక నాగేశ్వరరావుకు మిల్లెట్ (చోలు) ప్రాసెసింగ్ యూనిట్‌ను వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.నిర్మల జ్యోతి, ఎఒ ప్రసాద్ రావు గురువారం పరిశీలించారు. ప్రభుత్వం అందించిన ప్రాసెసింగ్ యూనిట్ సక్రమంగా వినియోగిస్తున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. ఫోటోతో వివరాలను కలెక్టర్ కు నివేదిస్తామని తెలిపారు.

ఇ-పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో జరుగుతున్న ఇ - పంట నమోదును పరిశీలించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పంటలకు ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో రైతులు ఇకెవైసి చేయించుకుంటే ప్రభుత్వ పరంగా వారికి రావాల్సిన రైతులు ఆటంకం ఉండదని అన్నారు. ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ మేరకు వ్యవసాయశాఖ అధికారి ఎస్.అవినాష్ పెద భోగిలి, అంటిపేట, రెడ్డివానివలస గ్రామాలను పరిశీలించి రైతుల వద్ద ఇకెవైసి నమోదు చేయించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ విఎఎలు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండానే అడ్డగోలు నిర్మాణాలు

- టౌన్ ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరత
- నిర్మాణాలపై కొరవడుతున్న నిఘా
- సచివాలయాల టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు ఉన్నా లేనట్టే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ పరిధిలో గల 30 వార్డుల్లో ఎటువంటి అనుమతుల్లేకుండా, విచ్చలవిడిగా భవన నిర్మాణాలు జరిగిపోతున్నాయి. ఇటీవల అక్రమ భవన నిర్మాణాలపై కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ప్రశ్నించినప్పటికి పట్టణ ప్రణాళిక విభాగం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ప్రైవేట్ ప్లానర్‌ను సంప్రదించకుండా, స్థానిక మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతులతో సంబంధం లేకుండా, బుడా అనుమతుల్లేకుండానే అడ్డగోలుగా గెడ్డలు, చెరువులు, బందలు, రైల్వే ట్రాక్‌లకు సమీపంలో భవన యజమానులు ఇష్టారాజ్యంగా అనధికార నిర్మాణాలు చేపడుతూ, మున్సిపల్ ఆదాయానికి గండికొడుతూ అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారు. గ్రేడ్ -1 మున్సిపాలిటీగా ఉన్న పార్వతీపురం జిల్లా కేంద్రగా ఆవిర్భవించిన తర్వాత ఈ అక్రమ నిర్మాణాలు మరింత ఎక్కువయ్యాయి. అనధికార, అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మిన్నకుండిపోవడంతో భవన యజమానులు తమ నిర్మాణాలను తొందరగానే పూర్తి చేసి మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. పట్టణంలో కొందరు అనుమతులు తీసుకోకుండానే భవనిర్మాణాలు చేస్తున్నారు. మరికొందరు నిర్మాణ అనుమతులు నామమాత్రంగా తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న పలు వాణిజ్య వ్యాపార కేంద్రాల వార్డుల్లో గృహ నిర్మాణాలకు అనుమతులు తీసుకొని దర్జాగా వ్యాపార, వాణిజ్య భవన నిర్మాణాలను చేపడుతున్నా మీరు కొట్టుకోండి తర్వాత మేం నోటీసులు ఇస్తామన్న చందంగా టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు వ్యవహరిస్తున్నారు. ఇటువంటి అనధికార నిర్మాణాల వల్ల ఆయా ప్రాంతాల్లో పార్కింగ్‌తో పాటు ట్రాఫిక్, ఇతర సమస్యలు ఎక్కువ


రైల్వే ట్రాక్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య సముదాయం నిర్మాణం

అవుతున్నప్పటికీ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయాల టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు పట్టించుకునే దాఖలాల్లేవు.

వ్యాపార వాణిజ్యాల కోసం భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నట్లయితే ప్లాన్‌లో వాహనాల పార్కింగ్‌కు స్థలం చూపించాల్సి ఉంది. అవేవీ చూపించకుండా పార్కింగ్ స్థలాలను వదలకుండా నిర్మాణాలను చేపట్టడానికి గృహ నిర్మాణాల అనుమతులను పొందుతున్నారు. నిర్మాణాలను పూర్తి చేసిన తర్వాత ఆ షాపులకు షట్టర్ బిగించి వేలాది రూపాయలు అద్దెలకు ఇవ్వడంతో, ఆ షాపులకు వచ్చేవారికి పార్కింగ్ సౌకర్యం లేక షాపు ముందు ఉన్న రహదారిపైనే ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతుంది. తాజాగా పట్టణంలోని పోలీస్ స్టేషన్ వీధి, టౌన్ నాయుడు వీధి కూడలి, కన్యకాపరమేశ్వరి వీధి, బెలగాం శివారులో రోడ్డుకి ఇరువైపుల ఉన్న ఖాళీ స్థలాల్లో టౌన్ ప్లానింగ్ విభాగానికి ఒక విధంగా ప్లాన్ పెట్టి, నిర్మాణాలు వేరే రకంగా చేపడుతున్నారు.

బైపాస్ రోడ్‌లో బఫర్ జోన్ అయిన రైల్వే ట్రాక్‌కు ఆనుకుని ఉన్న వ్యవసాయ పొలాల్లో నిబంధనల ప్రకారం ప్లాన్ ఇవ్వడానికి అనుమతులు లేనప్పటికీ సంబంధిత యజమానులు బరితెగించి మరీ భారీ భవన నిర్మాణాలు చేపడుతుండడంతో సంబంధిత శాఖ అధికారులకు భారీ ఎత్తున ముడుపులు ముట్టినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారికంగా మాత్రం టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ భవన నిర్మాణ యజమానులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడంతోనే సరిపెట్టుకుంటున్నారు. పట్టణంలో ఇలాంటి అనధికార భవన నిర్మాణాలు కోకొల్లలుగా భవన యజమానులు నిర్మిస్తూ, మున్సిపల్ ఆదాయానికి నష్టం కలిగిస్తున్నప్పటికీ, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు గానీ, టౌన్ ప్లానింగ్ అధికారులు గానీ సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు గానీ పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టే ఈ అనదికారిభవన నిర్మాణాలపై రీజనల్ డైరెక్టర్ డిప్యూటీ టౌన్ కంట్రీ ప్లానింగ్ అధికారులు దృష్టి పెట్టి సంబంధిత విభాగం పైన, అనధికార నిర్మాణాలు చేపడుతున్న యజమానులు పైనా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, ప్రజలు

చెత్తను వెంటనే తరలించాలి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న వ్యర్ధ పదార్థాలను చెత్తను తక్షణమే తరలించాలని, గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు చేయాలని, ఈ సమస్య తక్షణమే పరిష్కరించాలని, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ వి ఇందిరా డిమాండ్ చేశారు. సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకొండ పట్టణంలో సేకరించిన చెత్త నగర పంచాయతీ కార్యాలయం ఎదుట వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నిరంతరం జనసంచారం ఉండే స్థలాల్లో చెత్తను వేయడం వల్ల ఆ ప్రాంత ప్రజలు అనారోగ్యాల గురయ్యే పరిస్థితి ఉందన్నారు.ఈ సమస్యపై గతనెల 27న వినతి పత్రం అందజేశామన్నారు. చెత్తను తొలగిస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరించాలన్నారు. ఆందోళన కార్యక్రమం వద్దకు ఎస్సై ప్రయోగమూర్తి పోలీసుల సమక్షంలో నగర పంచాయతీ అధికారులు వారం రోజుల్లో చెత్త తరలిస్తామని, అంతవరకు ఇక్కడ చెత్త వెయ్యకుండా దుర్వాసన లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ మేరకు ఆందోళన విరమించారు. హామీ అమలు చేయకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కాదా రాము ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పాలకొండ కమిటీ కార్యదర్శి సిహెచ్ సంజీవి, టి.జగదీష్, రాజశేఖర్, పాపారావు, వి.భాను, పి.లలిత స్థానికులు మహిళలు పాల్గొన్నారు.

రోడ్డుపై దిగుబడిపోయిన లారీ

నిలిచిపోయిన 108 వాహనం • ఇబ్బందులు పడ్డ ప్రజలు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో రోజురోజుకీ అధ్వానంగా మారుతున్న అంతర్‌రాష్ట్ర రహదారిపై ప్రయాణాలు చేయాలంటే వాహనదారులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. తెలిసిన వారైతే ఆ రోడ్లో ప్రయాణం చేయడం కంటే విరమించుకోవడం మంచిదని కొంతమంది ఆగిపోతుంటే మరి కొంతమంది తెలియక ఈ రోడ్డుపై ప్రయాణాలు చేసి గోతుల్లో ఉండిపోయి అవస్థలు పడుతున్నారు. గురువారం పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారి గుమడ వద్ద భారీ గోతుల్లో లారీ దిగుబడిపోయింది. దీంతో పక్క నుంచి వెళ్లేందుకు చిన్న ఖాళీ ఉండడంతో అటుగా వెళ్లిన కారు కూడా బురదలో దిగుబడిపోవడంతో రాకపోకలకు భారీ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సుమారు మూడు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సమయంలో కొమరాడ వైపు నుంచి పార్వతీపురం వైపు వెళ్తున్న 108 అంబులెన్స్ కూడా ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయింది. దీంతో అంబులెన్స్ ఉన్న రోగుల కొంత మేరకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికుల సహాయంతో అంబులెన్స్‌లో ఉన్న రోగిని మోసుకుని అవతలి వైపుకు తీసుకెళ్లి ఆటోలో ఆసుపత్రికి తరలించారు. ఏదేమైనా మండలంలో గల రహదారిపై ఏర్పడిన భారీ గోతుల్లో వాహనాలు దిగుబడిపోయి మరమ్మతులకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గుమడ , కొమరాడ, చోళపదం, కునేరు వద్ద భారీ గోతులు ఏర్పడడంతో ప్రయాణించేందుకు అవకాశం లేదు. దీంతో కార్లపై వెళ్లేవారు మరింత ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రోడ్ల బాగు చేయాలని ప్రజాసంఘాలు సిపిఎం ఆధ్వర్యంలో అనేక ధర్నాలు చేసినా కనీసం అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి


అంతర్‌రాష్ట్ర రహదారి గొయ్యిలో కూరుకుపోయిన కారు

తాత్కాలికంగా అయినా రోడ్డుపై ఏర్పడిన గోతులను కప్పి ట్రాఫిక్ అంతరాయాన్ని, ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

తక్షణమే గోతులు కప్పకపోతే పోరాటాలు ఉధృతం.. సిపిఎం

మండలంలో అధ్వానంగా మారిన రహదారిపై ఏర్పడిన గోతులు కప్పకపోతే భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం చేస్తామని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి హెచ్చరించారు. గురువారం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన అంబులెన్స్ వద్ద ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఈ రోడ్డును పట్టించుకోకపోవడంతో ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం కూడా రోడ్డు మరమ్మతులకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్ల భవనాల శాఖ అధికారులు రోడ్లపై ఏర్పడిన పెద్ద పెద్ద గోతులు కప్పి అటు వానదారులు, ఇటు ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని కోరారు .

జపాన్ భాషపై శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

జపాన్ భాష నేర్చుకొని ఆ దేశంలో వైద్య రంగంలో విస్తత ఉద్యోగావకాశాలు పొందవచ్చునని జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి యు. సాయి కుమార్ గురువారం ఒక ప్రకటన పేర్కొన్నారు. ఈ మేరకు నావిస్ హెచ్ ఆర్ ఆధ్వర్యంలో ఏఎన్ఎం/జీఎన్ఎం/బీఎస్సీ-నర్సింగ్ చదివిన వారికి జపనీస్ భాషను ఎన్-5, ఎన్-4, ఎన్-3 స్థాయిల్లో నేర్పించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. జపాన్ భాష నేర్చుకున్న వారికి జపాన్‌లోని ఆస్పత్రుల్లో వర్కర్స్ ఇన్ హాస్పిటల్స్/కేర్ హెరీమ్ ఫెసిలిటీగా ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. జపాన్‌లో పని చేసేందుకు ఆసక్తి కలిగి, 32ఏళ్లలోపు వయసున్న వారంతా అర్హులేనని, తొలుత జపనీస్ భాషలో రెసిడెన్షియల్ విధానంలో బెంగళూరులోని నావిస్ హెచ్ ఆర్ సంస్థ కార్యాలయంలో ఆర్నెళ్ల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో వసతి, భోజన సౌకర్యాలుంటాయని, ఫీజు మాత్రం రూ.3.5లక్షలు (రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50 వేలు, శిక్షణ ఫీజు రూ.3లక్షలు) చెల్లించాల్సి ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50వేలులో ఏపీ నైపుణ్యాభివద్ధి సంస్థ సగం భరిస్తుందని, మిగిలిన మొత్తాన్ని అభ్యర్థులే చెల్లించాలని, మిగిలిన రూ.3లక్షల్ని మూడు విడతలుగా చెల్లించొచ్చన్నారు. శిక్షణ ఫీజుకు నావిస్ హెచ్ ఆర్ సంస్థ రుణ సదుపాయం కల్పిస్తుందని, ఉద్యోగం వచ్చాక మూడు దఫాలుగా తిరిగి చెల్లించవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 9676965949 ఫోన్ నంబర్ ను సంప్రదించాలని తెలిపారు.

క్రీడల్లో పోటీ తత్వం పెరగాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

క్రీడల్లో పోటీతత్వం పెరగాలని టిడిపి పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ క్రీడాకారులకు సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండల స్థాయి క్రీడ పోటీలు ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ఎంపియుపి, పాఠశాలల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి సుంబర, కెపి నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం రామకష్ణ, మండల స్థాయి అధ్యక్షులు ఎస్ ఉమామహేశ్వరరావుతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు కె.సాల్మన్ రాజు, ఎస్ పద్మరాజు, వండన రాజేంద్ర, టి.మధు, పోలిరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.


కురుపాం సిహెచ్‌సి వద్ద నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

జిఒ115ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

జిఒ 115ను రద్దు చేసి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేయాలని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం స్టాప్ నర్సులు విజయ, అలేఖ్య, అనంతలక్ష్మి, చంద్రకళ, పార్వతి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలందిస్తుంటే తమను విస్మరించి సచివాలయాల్లో పనిచేస్తున్న ఎఎన్ఎంలను స్టాఫ్ నర్సులుగా నియమించేందుకు ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. తక్షణమే ఈ జీవోను వెంటనే రద్దు చేసి నోటిఫికేషన్ ద్వారా పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : నోటిఫికేషన్ ద్వారా స్టాఫ్ నర్సు లను నియమించాలని స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద ఎపి నర్సు స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ తమకు నష్టం కలిగించే జిఒ 115 జీవోను రద్దు చేసి నోటిఫికేషన్ ద్వారా స్టాఫ్ నర్సు పోస్టులు భర్తీ చేయాలని కోరారు. మూడున్నరేళ్ల జిఎన్ఎం కోర్సు, నాలుగేళ్ల బిఎస్‌సి నర్సింగ్ కోర్సులు చదివి కొంతకాలంగా ప్రభుత్వాసుపత్రిలో సేవలు చేస్తున్నామని, కోవిడ్ సమయంలో ఎంతో మంది స్టాఫ్ నర్సులు సేవలందించి చనిపోయారని అన్నారు. ఇప్పుడు తమను కాదని ఇటీవల శిక్షణ పొందిన వారికి ఎఎన్ఎంలను, స్టాఫ్ నర్సులుగా నియమించేందుకు జీవో ఇవ్వడం అన్యాయమని అన్నారు.

పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి సీతానగరం

మండలంలోని బల్లకృష్ణారాయపురం, పెద్ద అంకలాం, బగ్గందొరవలస, తామరకండిలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఆయా గ్రామ సర్పంచులు ఎం.లలిత, ఎ.నాగేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పూడికతీతలు, మంచినీటి ట్యాంకులు క్లోరినేషన్ వంటి పనులు చేపట్టారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు గౌరి, లావణ్య, శ్రీనివాసరావు, పద్మావతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రయాణికులకు అవగాహన

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

మహిళా పోలీసు స్టేషన్ ఎస్సై రవీంద్ర రాజు, సిబ్బందితో కలిసి గురువారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు పోలీసులను సంప్రదించడానికి గాను డయల్ 100 గురించి వివరించారు. అలాగే ప్రజలు సైబర్ నేరస్తుల చేతిలో మోసపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరం జరిగినపుడు తక్షణమే సంప్రదించాల్సిన టోల్ ఫ్రీ నెంబర్ 1930 గురించి పోస్టర్లు ప్రదర్శించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌సి కె.వెంకటరావు, పిసి ఎం.క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో గల 33 కెవి, మావుడి 11 కెవి, శంబర ఫీడర్‌పైన ఉన్న చెట్లు కొమ్మలను తొలగించే కార్యక్రమం చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు చేపడుతున్నట్టు తెలిపారు. ట్రాన్స్‌కో ఇఇ జె.గోపాలరావు తెలిపారు. కావున కవిరిపల్లి, సన్యాసిరాజు పురం, తోటవలస, చెముడు, అంటివలస మొదలగు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

అడలి వ్యూ పాయింట్‌ను సందర్శించిన పిఒ

ప్రజాశక్తి - సీతంపేట


వ్యూపాయింట్‌ను పరిశీలిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

మండంలోని అడలి వ్యూ పాయింట్‌ను ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆడలి వ్యూ పాయింట్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వ్యూ పాయింట్‌ను మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. ఎక్కువమంది పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ కృష్ణకుమార్, పిహెచ్ఒ ఎస్‌వి గణేష్, ఎఇ నాగభూషన్, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - సాలూరు

విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక శ్రీ వెంకట విద్యా గిరి పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు గురువారం విరాళాల సేకరణ ప్రారంభించారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.గణేశ్వరరావు తొలి విరాళంగా లక్ష రూపాయల చెక్కును అందజేశారు. అనంతరం కోడూరు సాయి శ్రీనివాసరావు మాట్లాడుతూ సేకరించిన విరాళాలను సిఎం సహాయ నిధికి పంపించనున్నామని చెప్పారు. ఇటీవల వరదలతో విజయవాడ నగరం అతలాకుతలమైందని, వేలాదిమంది నిరాశ్రయులయ్యారని చెప్పారు.వారిని ఆదుకునేందుకు దాతలందరూ ముందుకు రావాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - భామిని

స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.శివకుమార్, గణితం ఉపాధ్యాయులు సవర జానకీరావు ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. ఈ నేపథ్యంలో వీరిని గురువారం పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి శాలువాతో సత్కరించి, సన్మానించారు. సామాజిక బాధ్యతతో కూడుకున్న వృతి ఉపాధ్యాయ వృత్తి అని, ఉపాధ్యాయులు సమాజం నిర్మాతలని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి సాసుపిల్లి ప్రకాష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏకలవ్య భవన నిర్మాణ పనులు పరిశీలించిన భూదేవి

మండల కేంద్రంలో నిర్మాణంలో గల ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. భవన నిర్మాణ పనులు ఎంత వరకు పూర్తయ్యాయనే అంశాలను సైట్ ఇంజనీర్ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆమె కోరారు. ప్రస్తుతం భామిని ఏకలవ్య విద్యార్థులు ఇతర వసతి గృహాల్లో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారని, ఈ అంశాన్ని ఐటిడిఎ పిఒ దృష్టికి తీసుకెళ్తానన్నారు. పరిశీలనలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల హర్షం

ప్రజాశక్తి - సాలూరు

స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్‌శాఖను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడంతో ఎక్సైజ్ అధికారులు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి వారు పాలాభిషేకం చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ శాఖను రద్దు చేయడం వల్ల తమపై పనిభారం తగ్గిందనీ చెప్పారు.

ములగలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్


రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మండలంలోని ములగ లో గురువారం డోకిసీల పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ మడక కృష్ణవేణి ప్రారంభించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అంటు రోగాలు ప్రబలకుండా ఉండేందుకు గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి జ్వరాల సర్వేను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ ఐశ్వర్య రోగులను పరిశీలించి ఉచితంగా మందులు అందించారు. పీహెచ్సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

130 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని గలావిల్లిలో బుధవారం 130 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సింహాచలం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 130 లీటర్ల నాటు సారాను గళావిల్లి వద్ద తయారు చేస్తున్నట్లు సమాచారం తెలియడంతో అక్కడికి సిబ్బందితో చేరుకొని అందులో వంద లీటర్లు అక్కడే ధ్వంసం చేసి 30 లీటర్ల నాటుసారాతో నిందితుడ్ని అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్లో ఉంచినట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు